క్లుప్తంగా

చెరువు కాల్వలు పరిశీలన


పైప్‌లైన్ పరిశీలిస్తున్న నాయకులు

కోరుట్ల రూరల్: మండలంలోని చిన్నమెట్పల్లిలో వర్షాకాలంలో వరదలతో కొట్టుకుపోయిన చెరువు కాల్వ పైప్‌లైన్‌ను ఆదివారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఇరిగేషన్ ఏఈతో ఫోన్లో మాట్లాడి మరమ్మతు పనుల కోసం నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని సూచించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొంతం రాజం, మాజీ సర్పంచ్ బొల్లి నర్సయ్య, నాయకులు మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక రుగ్మతలపై కళాజాత


మాట్లాడుతున్న ఎస్సై ఇంద్రకరణ్ రెడ్డి

కోరుట్లరూరల్: మండలంలోని మోహన్‌రావుపేటలో పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో సామాజిత రుగ్మతలపై శనివారం రాత్రి సాంస్కృతిక ప్రదర్శన ఇచ్చారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో పోలీసు చట్టాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఎస్సై ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. సామాజిక రుగ్మతలు, మూఢ నమ్మకాలు, సైబర్ క్రైమ్స్, డయల్ 100 వినియోగం తదితర అంశాలపై పోలీస్ కళాకారులు పాటలు, నాటికల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో కళాకారులు కమల్ ఇస్లావత్, గడ్డం రమేశ్, సత్తయ్య, సతీశ్, కాంతయ్య, హనుమంతు, డప్పు లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేతలకు బహుమతులు అందజేత


ట్రోఫీతో విజేత టీం సభ్యులు, ప్రజాప్రతినిధులు

కథలాపూర్: మండలంలోని ఊట్‌పెల్లిలో నిర్వహించిన గ్రామస్థాయి వాలీబాల్ టోర్నీ విజేతలకు సర్పంచ్ ఆదివారం బహుమతులు పంపిణీ చేశారు. గ్రామాల్లోని క్రీడాకారులను క్రీడల్లో ప్రోత్సహించాలని టోర్నీ నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గజ్జెల స్వామి, ఉపసర్పంచ్ గణేశ్, ఏజీబీ మహేందర్, నర్సయ్య, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత


చెక్కు అందిస్తున్న నాయకులు

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన రుద్రవేణి నర్సయ్యకు మంజూరైన రూ.25,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం ఎంపీటీసీ కొమ్ముల రాధ లబ్ధిదారుడికి అందజేశారు. నర్సయ్యకు ఇటీవల శస్త్రచికిత్స జరగగా, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సీఎఆర్ఎఫ్ చెక్కు మంజూరు చేయించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, రాజారెడ్డి, శ్రీనివాస్, నారయణరెడ్డి, అంజిరెడ్డి, విష్ణు, సాయి పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



కొండగట్టు: కొడిమ్యాల మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాణ ప్రతిష్టాపన పూర్తి చేసుకుని 41 రోజులు కావడంతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకం,ఘనంగా సుదర్శన హోమం మహ అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు జగన్నాథం,విష్ణువర్ధనా చార్యులు, నాగరాజు వేదపండితులు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నత్తనడకన మన ఊరు మన బడి పనులు

- 9 పాఠశాలలకు రూ.2.23 కోట్లు మంజూరు
- కొనసా..గుతున్న పనులు
- సౌకర్యాలు లేక విద్యార్థుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు


ఇబ్రహీంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పునాదులకే పరిమితమైన డైనింగ్ హాల్ పనులు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం మన ఊరు మన బడి పథకంలో కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసింది. మండలంలో మొదటి విడతగా 9 పాఠశాలలకు రూ. 2.23 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో పాఠశాలల్లో డైనింగ్ హాల్, మరమ్మతులు, అదనపు గదులు, టాయిలెట్స్, ప్రహరీల నిర్మాణం చేపట్టాలి. ఈ పనులను చేపట్టేందుకు ఏడాది క్రితం కాంట్రాక్టర్లు టెండర్లు వేసి పనులు దక్కించుకున్నారు. కొన్ని పాఠశాలలో పనులు పూర్తయినప్పటికీ మరికొన్ని పాఠశాలల్లో పనులు ప్రారంభ దశలోనే ఉన్నాయి. పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లకు ఆర్అండ్‌బీ శాఖ అధికారులు నోటీసులు పంపించినప్పటికీ పనులు కొనసాగడం లేదు. ఆయా పాఠశాలల్లో టాయిలెట్స్, అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి పనులు పూర్తి చేయించి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

పనుల్లో కనిపించని పురోగతి

మన ఊరు – మన బడి పథకం కింద మండంలోని 9 పాఠశాలలు ఎంపికయ్యాయి. గోధూర్ జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలకు రూ. 29.9 లక్షలు మంజూ రు కాగా, డైనింగ్ హాల్, 2 అదనపు తరగతి గదులు, టాయిలెట్స్ నిర్మాణం కాలేదు. వర్షకొండ జిల్లా పరిషత్ పాఠశాలకు రూ. 55 లక్షలు మంజూరు కా గా, డైనింగ్ హాల్ నిర్మాణం పూర్తయింది. 2 అదన పు తరగతి గదులు నిర్మాణం కాలేదు. ప్రాథమిక పాఠశాలకు రూ.16 లక్షలు మంజూరు కాగా పనులు చివరి దశలో ఉన్నాయి. మూలరాంపూర్ ప్రాథమిక పాఠశాలకు రూ. 18 లక్షలు మంజూరు కాగా పనులు పూర్తయ్యాయి. కోజన్‌కొత్తూర్ పాఠశాలకు రూ. 29 లక్షలు మంజూరు కాగా పనులు పూర్తి అ య్యాయి. కోమటి కొండాపూర్ ప్రాథమిక పాఠశాల కు రూ.23 లక్షలు మంజూరు కాగా డైనింగ్ హాల్ నిర్మాణం పూర్తి కాలేదు. ఇబ్రహీంపట్నం జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలకు రూ. 36 లక్షలు మంజూరు కాగా డైనింగ్ హాల్ నిర్మాణం పునాదులకే పరిమితమైంది. టాయిలెట్స్, ప్రహరీ పనులు ప్రారంభం కాలేదు. ఇబ్రహీంపట్నం ఒడ్డెర కాలనీ పాఠశాలకు రూ. 4 లక్షలు , ప్రాథమిక పాఠశాలకు రూ. 13 లక్షలు మంజూరు కాగా పనులు పూర్తయ్యాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులు పూర్తి చేయించి విద్యార్థుల ఇబ్బందులు తొ లగించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

టాయిలెట్స్ లేక ఇబ్బందులు



మన ఊరి – మన బడి పథకం కింద నిధులు మంజూరు కాగా సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభ దశలోనే నిలిపివేశారు. టాయిలెట్స్ లేక విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పాఠశాల చుట్టు ప్రహరీ, డైనింగ్ హాల్, మరమ్మతు పనులను సంబంధిత శాఖ అధికారులు కాంట్రాక్టర్‌తో వెంటనే పూర్తి చేయించాలి.

– రాజన్న, జెడ్పీహెచ్ఎస్, హెచ్ఎం, ఇబ్రహీంపట్నం

నోటీసులు ఇచ్చాం



పాఠశాలలకు మన ఊరి – మన బడి కింద నిధులు మంజూరు కాగా కొన్ని చోట్ల మాత్రమే పనులు పూర్తయ్యాయి. కొన్ని పాఠశాలల్లో పనులు ప్రారంభ దశలోనే నిలిపివేసిన కాంట్రాక్టర్లకు వెంటనే పనులు ప్రారంభించాలని మొదటి నోటీస్ అందచేశాం. పనులు పూర్తి చేయకపోతే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటాం.

– వేణు, ఆర్అండ్‌బీ, ఏఈ, మెట్‌పల్లి

కారోబార్ల సమస్యలు పరిష్కరించాలి


ప్రభుత్వ విప్‌కు వినతిపత్రం ఇస్తున్న కారోబార్లు

ధర్మపురి: గ్రామపంచాయతీల్లో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కారోబార్ల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని కారోబార్ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు.ధర్మపురి పట్టణంలో ఆదివారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు కారోబార్ల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కారోబార్లు, బిల్ కలెక్టర్లను 51 జీ.వో మల్టిపర్పస్ విధానం నుంచి మినహాయించి సహాయ కార్యదర్శులుగా నియమించాలని పేర్కొన్నారు. పంచాయతీలో పని చేస్తున్న ప్రతి ఒక్క సిబ్బందికి 15,600 రూ.ల కనీస వేతనం చెల్లించాలని, ప్రమాదవశాత్తు సిబ్బంది మరణిస్తే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ప్రతి నెల ఇచ్చే జీతాలు సర్పంచ్, ఉప సర్పంచ్‌లు పంచాయతీ నిధుల నుండి కాకుండా నేరుగా ప్రభుత్వ బడ్జెట్ నుంచి పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని, అదే విధంగా సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

గంగపుత్రులకు నగదు బదిలీ చేయాలి


అభివాదం చేస్తున్న గంగపుత్ర సంఘం నాయకులు

మెట్‌పల్లి: గంగపుత్రులకు ప్రభుత్వం చేప పిల్లల పంపిణీకి బదులు నగదును అందజేయాలని గంగపుత్రుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కావూరి వెంకటేశ్ కోరారు. పట్టణంలోని నరేందర్‌రెడ్డి గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. చెరువుల్లో పెంచడానికి నాసిరకం చేప పిల్లలను పంపిణీతో వల్ల ప్రయోజనం లేకుండా పోతుందన్నారు. నగదును అందజేస్తే నాణ్యమైన చేప పిల్లలను కొనుగోలు చేసి పెంచుతామన్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో గంగపుత్రుల సంఘ భవనానికి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో న్యాయవాది కొమొరెడ్డి కరం, డీఎఫ్‌సీఎస్ చైర్మన్ పల్లికొండ ప్రవీణ్, హరికుమార్, పర్రె శంకర్‌రాజు, శ్రీనివాస్, భూమేశ్ పాల్గొన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి



మాట్లాడుతున్న సీఐ రామ నర్సింహరెడ్డి

ధర్మపురి: క్రీడలతో స్నేహభావంతో పాటు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తాయని ధర్మపురి సర్కిల్ సీఐ రామ నర్సింహరెడ్డి అన్నారు. మండలంలోని రాయపట్నంలో గోళ్ల కిషన్ (రెడ్డి) స్మారకంగా వారి మిత్రులు రాందేని మారుతీ, బొప్పు వెంకటేశ్, పోతరాజుల వెంకటేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మిత్రుడి జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం గొప్ప విషయమన్నారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. ఆదివారం జరిగిన ఫైనల్‌లో విజేతగా నిలిచిన వేములవాడ జట్టుకు, రన్నర్‌గా నిలిచిన నేరెళ్ల జట్టుకు నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్ దినేశ్, కమలాకర్, శరత్, శ్రీకాంత్, క్రీడాకారులు పాల్గొన్నారు.



పెగడపల్లి రైతువేదిక వద్ద మద్యం సీసాలు

మందుబాబులకు అడ్డాగా రైతు వేదిక

పెగడపల్లి: మండల కేంద్రంలో నిర్మించిన రైతు వేదిక భవనంతో పాటు మార్కెట్ గోడౌన్ ఆవరణలో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలు, మందుబాబులకు అడ్డాగా మారాయి. ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి రైతుల కోసం నిర్మించిన ఈ భవనం నాలుగైదు నెలలుగా ఎలాంటి కార్యక్రమాలు లేక నిరుపయోగంగా ఉంది. దీంతో రాత్రి వేళ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. మార్కెట్ పాలక వర్గం రద్దు కావడంతో పట్టించుకునే వారు లేక మందుబాబులు విచ్చలవిడిగా మద్యం తాగుతూ, మద్యం బాటిళ్లు పగుల గొడుతూ విధ్వంసం సృష్టిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని స్థానికులు, రైతులు ఆరోపిస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మందుబాబులు రెచ్చిపోతున్నా.. పోలీసులు కూడా పట్టించుకోవడం లేదు. దీనిపై పోలీసులు దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..

కోరుట్లటౌన్: పట్టణంలోని కటికెవాడలో ఉన్న నూతన ప్రాథమిక పాఠశాల (ఎస్,యూపీఎస్) లో పది నెలల క్రితం ఒక గది గోడ రోడ్డు వైపు కూలిపోయింది. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో గది స్లాబ్ ఒక వైపు కుంగిపోయింది. ఎప్పుడు పడిపోతుందో తెలియని పరిస్థితి ఉంది. చుట్టు పక్కల పిల్లలు, పాఠశాలలో చదివే విద్యార్థులు ఆడుకునే క్రమంలో స్లాబ్ కుంగిన గది కిందకు వెళ్లే అవకాశం ఉంది. ప్రమాదం జరగక ముందే ఆ గదిని పూర్తిగా కూల్చేసి, చర్యలు చేపట్టాలని పిల్లలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



అంతర్గాం జీపీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు

జగిత్యాలటౌన్: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. శిథిలావస్థలో ఉన్న అంతర్గాం గ్రామ పంచాయతీ స్థానంలో నూతన భవనం నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఈనెల 25న నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డికి లేఖ రాశారు. ఉపాధి హామీ పథకం నుంచి నిధులు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రొసీడింగ్ విడుదల చేశారు. గ్రామపంచాయతీ నూతన భవనానికి నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్సీకి అంతర్గాం గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి


సీఐకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోరుట్ల: పట్టణ శివారులోని కోనరావుపేట రోడ్డులో తమ కుల సంఘ సభ్యులపై రాళ్లతో దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పద్మశాలీ సంఘం సభ్యులు ఆదివారం సీఐ ప్రవీణ్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. కోనరావుపేట రోడ్డులో మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు తమ సంఘానికి సర్వే నెంబర్ 1301లో 2 ఎకరాల స్థలం కేటాయించారని, ఆ స్థలంలో 27 వ జనవరి గణతంత్ర్య దినోత్సవం రోజు జాతీయ జెండాను ఆవిష్కరించామని పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం తమ సంఘ సభ్యులు అల్లె లక్ష్మీనారాయణ, వంగరి గణేశ్ జెండాను అవగతం చేసి తీసుకవస్తున్న క్రమంలో పట్టణానికి చెందిన కసుల గంగారెడ్డి, కసుల గంగాధర్, మరో వ్యక్తి తమ సంఘ సభ్యులను రాళ్లతో కొట్టి, దుర్భాషలాడారని పేర్కొన్నారు. వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రేపు అయితిపల్లి జీపీ భవనం ప్రారంభం

పెగడపల్లి: మండలంలోని అయితిపల్లిలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభానికి సిద్ధమైంది. ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా ఈ నెల 30న ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సర్పంచ్ కొండయ్య ఆదివారం తెలిపారు.

కొల్వాయిలో ఘనంగా పోచమ్మ బోనాలు


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గౌడ కులస్తులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయిలో జరుగుతున్న ఎల్లమ్మ పట్నాల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ఆదివారం గ్రామంలోని గౌడ కులస్తులు బోనాలను సమర్పించారు. గ్రామంలో ఐదేళ్లకోసారి జరిగే ఈ వేడుకల్లో ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. కాగా ఎల్లమ్మ పట్నాల్లో మూడో రోజు డప్పుచప్పుళ్లతో అమ్మవారికి పెద్దఎత్తున మహిళలతో కలిసి బోనాలను, నైవేద్యాలు సమర్పించారు.

నియామకాలు

ఎల్ఐసీ ఏజెంట్స్ సంఘం కార్యవర్గం ఎన్నిక


ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

జగిత్యాల: లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ సమాఖ్య జగిత్యాల శాఖ ఎన్నికలు ఆదివారం బండారి గార్డెన్స్‌లో నిర్వహించారు. అధ్యక్షుడిగా ఏ.వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శిగా గుండా నాగరాజు, కోశాధికారిగా కట్ట నరసయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలిండియా పొలిటికల్ జేఏసీ అధ్యక్షుడు బోయినపల్లి ప్రభాకర్‌రావు, కరీంనగర్ డివిజన్ ఏజెంట్ల సమాఖ్య అధ్యక్షుడు గట్టు రాజయ్య, ప్రధాన కార్యదర్శి పెంచాల రంగారావు, కోశాధికారి గంధం వెంకటేశ్వరు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

ధర్మపురి: ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చిర్ర లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఆదివారం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెందోలి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కట్ట లక్ష్మణ్, సుద్దాల నరేశ్, ప్రధాన కార్యదర్శి పారొపెల్లి లక్ష్మణ్, అధికార ప్రతినిధి జిలపెల్లి గంగారాం, కార్యదర్శులుగా దూడ లక్ష్మణ్, మోతె ప్రభాకర్, కోశాధికారి కుంటాల శంకర్ తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరుగు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అరికెల్ల సతీశ్ పాల్గొన్నారు.

కోరుట్ల ఆవోపా అధ్యక్షుడిగా కోటగిరి మహేశ్


మహేశ్

కోరుట్లటౌన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కోటగిరి మహేశ్ ఎన్నికయ్యారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ భవనంలో ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష స్థానానికి కోటగిరి మహేశ్, మేడి కిషన్ పోటీ పడగా, మహేశ్‌కు 79 ఓట్లు, మేడి కిషన్‌కు 32 ఓట్లు వచ్చాయి. 47 ఓట్ల మెజార్టీతో మహేశ్ గెలుపొందినట్లు ఎన్నికల నిర్వాహకులు శక్కరి వెంకటేశ్వర్లు, మోటూరి ప్రవీణ్ కుమార్, ఆంజనేయులు ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎన్నికైన మహేశ్‌ను ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు శాలువతో సత్కరించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమావేశమైన మల్యాల జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు

మల్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ముత్యంపేటలోని దిగువ కొండగట్టులో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 1989లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 34 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. కార్యక్రమంలో 60 మంది విద్యార్థులు పాల్గొని, చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు.

మెట్‌పల్లిలో డిగ్రీ విద్యార్థులు..


డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు

మెట్‌పల్లి: పట్టణంలోని మనోహర్ గార్డెన్‌లో ఆదివారం జ్ఞానోదయ డిగ్రీ కళాశాలకు చెందిన 2018–21 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ అప్పటి విద్యార్థులు తరలివచ్చి నాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. తమకు చదువు చెప్పిన అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్, లెక్చరర్లు పాల్గొన్నారు.